

● ఎన్టీఆర్ అభిమానుల సంబురాలు

ప్రముఖ సినీ నటుడు, ఏపీ టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలుగు చిత్రసీమలో 50వ మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నగరంలోని బంజారాహిల్స్‌లోని బసవ తారక రామారావు విగ్రహానికి ఎన్టీఆర్ అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్టీఆర్ కళామందిర్ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు, టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్, నాయకులు బోపణ ప్రవణ్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్

నల్లకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని బీజేపీ వైపు ఆకర్షితులను చేయడానికి పార్టీశ్రేణులు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ అన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చుక్క జగన్ అధ్యక్షతన ఇంద్రప్రస్థ కాలనీ కమ్యూనిటీహాల్‌లో పార్టీ సభ్యత్వంపై డివిజన్ స్థాయి వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆదేశాల మేరకు డివిజన్‌లోని బూత్‌ల వారీగా ఇంటింటికీ వెళ్లి అన్ని వర్గాల ప్రజలచే పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. కృష్ణగౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్, అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ శ్యామ్‌రాజ్ ముదిరాజ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ పాండు రంగయ్య పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

నల్లకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో అంతర్గత, రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను స్థానిక కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి శనివారం పరిశీలించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించే గణేష్ నిమజ్జన ఊరేగింపునకు అవి ఆటంకంగా కలించేలా ఉండటంతో వెంటనే ఆమె జీహెచ్‌ఎంసీ ఆర్బికల్చర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ బృందాన్ని పిలిపించి చెట్ల కొమ్మలను కొట్టించి అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రమణారావు తదితరులు

టీబీఎస్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్

నల్లకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి జిల్లా నివాసి పామరాజు విజయ్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం నల్లకుంటలో జరిగిన సమితి సమావేశంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని బ్రాహ్మణుల న్యాయమైన హక్కుల సాధన, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం బ్రాహ్మణ సేవా సమితి అంకితభావంతో పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ఆర్కే దేశ్‌ముఖ్, కోశాధికారి మంత్రి సునీల్, సహాయ కార్యదర్శి అక్కిరాజు దుర్గాప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాస్ గోపాల్‌రావు, రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో దోమల నివారణకు పటిష్ట చర్యలు



కాచిగూడలో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడలో దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. డివిజన్‌లోని చప్పల్‌బజార్, ఇందిరానగర్‌లో ఆమె పాదయాత్ర చేసి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా కేసులు పెరుగుతుండడం వల్ల అన్ని బస్తీలలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నామని, బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉంచామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డాక్టర్ మనోజ్‌రెడ్డి, వైద్యులు శ్రీనివాస్, సాయిబాబా, ఇందిర పాల్గొన్నారు.

చిక్కడపల్లి పీఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ

● పలు కేసుల వివరాలపై ఆరా?



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాన్ష్‌యాదవ్ శనివారం ఉదయం 8 గంటలకు చిక్కడపల్లి పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి సేవనం కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారంతో ఆయన పీఎస్‌కు వచ్చినట్టు తెలిసింది. కాగా పీఎస్ పరిధిలో ఇటీవల కాలంలో చోటు చేసుకున్న సంఘటనలు, కేసుల వివరాలు ఆయన క్షుణ్ణంగా తెలుసుకున్నట్టు సమాచారం. గోల్కొండచౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ఆధిపత్య పోరు, బాగ్‌లింగంపల్లి మదర్ డయిరీ వద్ద గంజాయి సేవించిన యువకులు కాలేజీ విద్యార్థినులను కారుతో ఢీకొట్టడం, ఓ మహిళ తలకు గాయం కావడం వంటి అంశాలపై కూడా డీసీపీ ఆరా తీశారని తెలిసింది. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ రొటీన్ కేసుల వివరాలతోపాటు రానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, 100 నెంబర్ కాల్ వస్తే వెంటనే స్పందించాలని వంటి సూచనలు డీసీపీ చేశారని తెలిపారు. ఏసీపీ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటితో భక్తులకు ఇక్కట్లు



శనివారం కురిసిన వర్షపు నీటితో పాటు స్థానికంగా మంచినీటి పైప్‌లైన్ లీకేజీ వల్ల ముషీరాబాద్‌లో మహంకాళి ఆలయం ముందు నీళ్లు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఆలయంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. నీటిలో నుంచే నడుచుకుంటూ గుడిలోకి వెళ్లాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

-(ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

●అనవసరంగా బయట తిరగ వద్దు

● భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు సూచన



గోల్నాక, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, మరింత భారీగా వర్షాలు కురువనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. వర్షాల వల్ల నియోజక వర్గం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా తాను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి అధికారులతో మాట్లాడు తూ అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలోని ఆయా బస్తీలలో వర్షం మూలంగా ఎలాంట సమస్యలు వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాలేరు సూచించారు. నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్పుడు అనవసరంగా బయట తిరిగి సమస్యలను కొని తెచ్చుకొవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలి



ఆదిభట్ల నారాయణదాసు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న రమణాచారి తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళారూపాలను కాపాడుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. తెలుగుభాషకు మాత్రమే సొంతమైన ప్రాచీన కళా సంపద హరికథ అని ఆయన అన్నారు. త్యాగరాయగానసభ, తెలంగాణ హరికథా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం గానసభలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలు నిర్వహించారు. డా. రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆదిభట్ల నారాయనదాసు ప్రారంభించిన హరికథా మహాగాన యజ్ఞం శతాబ్దిపైగా కొనసాగుతూ ఈనాటికీ ఎందరికో ఆ కళ ఉపాధినిస్తోందన్నారు. నారాయణదాసు బహుభాషలలో పండితుడు అని సంగీత సాహిత్యాలలో అపారజ్ఞాననిధి అన్నారు. హరికథ, బుర్రకథ, నాటకం వంటి ప్రాచీనకళారూపాలు ముందుతరాలకు అందించాల్సి ఉందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, జానపద శాస్త్రీయ కళాప్రదర్శనలు ఎవరు నిర్వహించినా 365 రోజుల్లో గానసభలోని ఏడు ఆడిటోరియంలలో సందర్భాన్ని బట్టి ఒకటి ఉచితంగా ఇస్తామని వివరించారు. కిన్నెర రఘురామ్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది వారం రోజుల పాటు తమ సంస్థ హరికథా సప్తాహం నిర్వహిస్తున్న అంశాన్ని వివరించారు. తెలంగాణ హరికథా కళాకారుల సంఘం అధ్యక్షుడు బి. లక్ష్మీనారాయణ, విశ్వనాథజయరాములు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్

రాంనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కులగణన నిర్వహించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐ (యు) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రజలు నరేంద్రమోదీ మెజారిటీ తగ్గించిన కూడా పరిపాలనలో ఏ మాత్రం మార్పులు రావడం లేదన్నారు. మోదీ ప్రజావ్యతిరేక నిర్ణయాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజా పోరాటాలు ఉధృతం చేయ నున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు వనం సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, కుమారస్వామి, సుకన్య, తుకారం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ సీపీఆర్‌ఓగా విరమణ పొందిన మహమ్మద్ ముర్తుజాను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఉద్యోగులు శనివారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

కాంట్రాక్టర్ల వేధింపుల నుంచి కాపాడండి

● ఇసుక లారీ యజమానుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఇసుక లారీల యజమానులు

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లతో తమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని ఆటోనగర్ యజమానుల సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సంస్థ జీఎం రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జీఎం రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్ ఇసుక లారీల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ మాట్లాడుతూ తాము అధికారికంగా ప్రభుత్వానికి డీడీ తీసి క్వారీల వద్దకు వెళ్లగానే అక్కడ ఉన్న కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో రూ.4 వేల నుంచి రూ.5 వేలు, అదనపు బకెట్ పేరుతో రూ.2 వేలు, పట్టా పేరుతో వెయ్యి రూపాయలు, ఎక్స్‌కవేటర్ పేరుతో వెయ్యి రూపాయలు, గ్రామపంచాయతీ అంటూ వెయ్యి రూపాయలు, కాంటా పేరుతో రూ.200 ఇలా దాదాపుగా ఒక్కో లారీకి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు అధికారులు తనిఖీలు చేసినప్పుడు ఓవర్ లోడ్ పేరుతో లారీ యజమానులు కేసుల పాలవుతూ, జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు టీజీఎండీసీ ఎండీ, జీఎంలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి క్వారీల్లో అక్రమంగా వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని లారీ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట లారీల అధ్యక్షుడు నర్రి వెంకన్న, బల్వంతరెడ్డి, నాగేందర్‌రెడ్డి, రాజు ముదిరాజ్, కాసుల జంగయ్యగౌడ్, ఆకుల శ్రీను, లగ్గొని శ్రీనివాస్, రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకోమని మందలిస్తే ఇంటి నుంచి వెళ్లిపోయాడు!

బర్కత్‌పురా ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చదువుకొమ్మని కుటుంబ సభ్యులు మందలిస్తే ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది ఎస్సైలు నరేష్ కుమార్, సురేష్ కుమార్లు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్ నగర్ సంజీవయ్య నగర్ లో నివాసముంటున్న రమేష్ కుమారుడు రక్షణ సంగమేశ్(15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి చదువుకోవాలని కుటుంబ సభ్యులు మందలించారు దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంగమేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు స్నేహితులు బంధువుల ఇళ్లలో వెతికారు బాలుడు ఆచూకీ లభించలేదు దీంతో బాలుడి అన్న సాయికుమార్ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు

హెబ్రోన్ చర్చిలో మరోసారి ఆధిపత్య పోరు

● శనివారం రాత్రి చర్చి ప్రధానగేటు ముందు గుమిగూడిన ట్రస్ట్, సొసైటీ సభ్యులు

● దాడిచేసిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో శనివారం రాత్రి మరోసారి ఆధిపత్య పోరు మొదలైంది. కొంతకాలంగా చర్చిని నిర్వహిస్తున్న సొసైటీకి, తమదే నిర్వహణ బాధ్యత అని చెపుతున్న ట్రస్ట్ మధ్య గొడవలు జరుగుతున్న విషయం విదితమే. ఈ అంశం న్యాయస్థానంలో ఉండగా సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రస్తుతం చర్చి నిర్వహణ కొనసాగుతోంది. నాలుగురోజుల కిందట మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు జోక్యం చేసుకుని చర్చి వ్యవస్థాపకుడు భక్త సింగ్ ఆశయాల మేరకు చర్చి సొసైటీ అందరం కలిసి పనిచేస్తాం, చర్చిని నిర్వహిస్తామంటూ సమావేశం నిర్వహించి విలేకరులకు వివరాలు కూడా తెలియజేశారు. ఇది జరిగి నాలుగురోజులు కాకముందే శనివారం రాత్రి మళ్లీ ట్రస్ట్, సొసైటీ మధ్య గొడవ మొదలైంది. సొసైటీకి చెందిన కొందరు ట్రస్ట్ వారితో రాజీకి ససేమిరా అంటూ తమకు అనుకూలంగా కోర్టులో ఆర్డర్ తేవడానికి కోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ట్రస్ట్ సభ్యులు కొందరు చర్చిలోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఈ దాడిలో సీసీటీవీ కెమెరాలు ధ్వంసం అయినట్లు సమాచారం. చర్చి అడ్మిన్‌బ్లాక్ ప్రధాన గేట్‌ను నుంచి లోపలికి వెళ్లడానికి కొందరు యత్నించగా, చిక్కడపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చర్చి ముందు భారీగా ట్రస్ట్, సొసైటీ సభ్యులు గుమికూడటంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు యత్నిస్తున్నారు.

ఇద్దరు విద్యార్థినులను ఢీకొన్న కారు

● ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స

● డబ్బులు లేక ఆస్పత్రి నుంచి వెంటనే డిశ్చార్జ్

● నిందితుల విషయంలో పోలీసుల ఉదాసీనత!

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాగ్‌లింగంపల్లి మదర్ డయిరీ పార్కువద్ద ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు విద్యార్థినులు గాయపడ్డంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ అంబేడ్కర్ కళాశాలకు చెందిన ఒక విద్యార్థినికి తలకు గాయం కాగా మరో విద్యార్థిని కాలుకు దెబ్బలు తగిలాయి. స్థానికుల కథనం ప్రకారం... శుక్రవారం మధ్యాహ్నం నలుగురు యువకులు ఓ కారు నడుపుతూ ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థినులను ఢీకొట్టారు. అదే వేగంతో వెళ్లి మరోకారును ఢీకొట్టారు. అయితే ఘటనకు స్పందించిన స్థానికులు కారులో ఉన్నఒక మైనర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగతా ముగ్గురు పారిపోగా, తర్వాత మరో ఇద్దరిని కూ డా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఆ ముగ్గురినీ పోలీసులు వదిలేసిన ట్లు సమాచారం. యాక్సిడెంట్ చేసిన యువకులు గంజాయిమత్తులో ఉన్నట్లు సమాచారం. ఇదే విషయమై అడ్మిన్ ఎస్‌ఐ నాగరాజును శనివారం రాత్రి సంప్రదించగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నా రు. విద్యార్థినులకు స్వల్పగా యాలయ్యాయన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలిం చిన తర్వాత కానీ కారుతో ఢీకొట్టింది వారేనా అనేది నిర్ధారిం చలేమన్నారు. కాగా, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు చికిత్స చేయించుకొనేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు వారిని డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకె ళ్లినట్టు సమాచారం. అయితే, కారుతో ఢీకొట్టిన యువకుల విషయంలో మాత్రం పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మారం జగదీశ్వర్

రాజేంద్రనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్వవిద్యాలయాల ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను త్వరలోనే సీఎం ఎ.రేవంత్‌రెడ్డి దగ్గర చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ తెలిపారు. టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ పాలకవర్గం సభ్యులతోపాటు టీజీవోస్ కేంద్ర సంఘం నాయకులను శనివారం రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం టీచింగ్, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న నాయకులు మారం జగదీశ్, డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్, ఏలూరి శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ, పశువైద్య విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సంఘం నాయకులకు అండగా ఉంటామన్నారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్లను నియమించేలా టీఎన్‌జీవోస్, టీజీవోస్ కేంద్ర నాయకత్వం చొరవ తీసుకోవాలన్నారు. పాతపెన్షన్ స్కీమ్‌ను అందరు ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల పాలకమండలిలో బోధనేతర సిబ్బంది నుంచి ఒకరికి అవకాశం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులను అందజేసి, నగదు రహిత వైద్య సేవలను ప్రతి ఉద్యోగికీ ఇవ్వాలన్నారు. ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. టైంస్కేల్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులను కాంట్రాక్టు పద్ధతిన కాకుండా దినసరి కూలీలుగా తీసుకుని వేతనాలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు.



గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విరమణ పొందిన వెంకటేశ్వర్లును శనివారం ముషీరాబాద్ బస్‌భవన్‌లో ఘనంగా సత్కరిస్తున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఉన్నతాధికారులు.

-(హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపంతో ఓ విద్యార్థి హోటల్ రెస్ట్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ పీఎస్ సీఐ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న కోట బాలాజీ (20) బీఎంఎల్‌డీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కాచిగూడ త్రివేణి లాడ్జీలో పార్ట్‌టైమ్ రిసెప్షనిస్టుగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధుల్లోకి వచ్చిన బాలాజీ శనివారం తెల్లవారుజామున రెస్ట్ రూమ్‌లో బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం సిబ్బంది ఎంత తలుపు కొట్టిన తీయలేదు. గడియ పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బాలాజీ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అతను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, ఆమె పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసిందని పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న చైర్మన్ ప్రొఫెసర్ వెంకట్రావ్

బర్కత్ పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్రావ్ అన్నారు. శనివారం కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో 69 మంది విద్యార్థులకు మెరిట్ అవార్డ్ స్కాలర్‌షిప్‌లను అందజేసి మాట్లాడారు. మున్నూరుకాపు విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం 600 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశామన్నారు. బాలికల విద్యకు అధిక ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ బోర్డు ట్రస్టీ పిల్లి శ్రీనివాస్‌రావు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ట్రస్టీ మేనేజర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రబంధ సేవాకాలం, ఆరగింపు, శాత్తుమొర తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలోపాల్గొన్నారు. కాగా శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా రాష్ట్ర హైకోర్టు అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులతో పాల్గొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకవంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదలకు సేవ చేయడం ఎంతో ఉత్తమం

చిక్కడపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడం ఎంతో ఉత్తమమైనదని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ పీఆర్‌ఓ డా. జీకే రమణ, తెలుగు యూనివర్శిటీ పూర్వ రిజిస్ట్రార్ టి. గౌరీశంకర్ అన్నారు. కృష్ణమందిర్ సహకారంతో లయన్స్‌క్లబ్ వారు శనివారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వారు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. లయన్స్‌క్లబ్, కృష్ణ మందిర్ సభ్యులు దేవేందర్ భండారి పాల్గొన్నారు.

మహాకాళి ఆలయ హుండీ లెక్కింపు

ముషీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్‌లోని మహాకాళి ఆలయ హుండీ లెక్కింపును శనివారం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.2 లక్షల 6 వేల నగదు వచ్చిందని ఈఓ మహేందర్‌కుమార్ తెలిపారు. దేవాదాయ శాఖ అధికారి మహేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు చంద్రమౌళి, తేజాగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ మహాకాళి జిల్లా ఎస్‌టీ మోర్చా అధ్యక్షుడిగా బాలకృష్ణ



నియామకపత్రాన్ని అందజేసిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ మహా కాళి జిల్లా ఎస్‌టీ మోర్చా అధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ సీని యర్ నాయకుడు ఎ. బాలకృష్ణ (ఎరుకల) నియమితులయ్యారు. శనివారం ఆయనకు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పదవులు వస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి బాధ్యతలు అప్పగించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేపీ ఎస్‌టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

9న గిరిజన సింహగర్జన

రాంనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సేవాలాల్ సేనా 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గిరిజన సింహగర్జన నిర్వహించనున్నట్లు సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సేవాలాల్ సేనా కేంద్ర కార్యాలయంలో సింహగర్జన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ విధంగా గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సైదానాయక్, రమేష్, కల్యాణ్‌నాయక్, శంకర్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడిన ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 40 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి నడుస్తున్న రైలు దిగబోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడి ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి..

బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో 65 ఏళ్ల వయసు గల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.